సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

గురువారం | 20 | మార్చి | 2025





నేడు మామిడి మార్కెట్ ప్రారంభం

ఏనుమాములలోని ముసలమ్మ కుంట పక్కన ఏర్పాటు చేసిన మామిడి మార్కెట్‌ను గురువారం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించనున్నారు. -IIలో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.


భారీ ఆశలు అత్యధిక అంచనాలు

నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మేయర్

- ఏటా లోటే.. అయినా తగ్గేదే లేదా?
- పెదవి విరుస్తున్న విపక్షాలు

వరంగల్ అర్బన్ : రాష్ట్ర రెండో రాజధానిగా గుర్తింపు పొందిన గ్రేటర్ వరంగల్ నగర రాబడి తగ్గుతున్నా ఆదాయ, వ్యయ రూపకల్పనలో ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా నిధులు వస్తాయని ఆశిస్తోంది. ప్రతీ ఏడాది వేసుకున్న ఆదాయ, వ్యయ అంచనాలను అందుకోవడంలో ఆశలు తలకిందులవుతున్నాయి. 2014–15 నుంచి ప్రస్తుత బడ్జెట్ వరకు అంచనాలు అంకెల గారడీలు మారాయి. ఒక ఏడాది పెంచుతూ, మరో ఏడాది తగ్గిస్తూ వస్తున్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశంలో 2025–26 బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు.

2024–25కు సంబంధించి రూ.650.12 కోట్లతో బడ్జెట్ అంచనాలను సవరించిన బల్దియా అధికార, పాలకవర్గం 2025–26 ఆర్థిక సంవత్సరంలో 1,071.48కోట్లతో రూపకల్పన చేశారు. ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండానే యథావిధిగా ఆమోదింపజేసుకునేందుకు అధికార పక్షం యత్నిస్తోంది. కానీ, బడ్జెట్ అంచనాలపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ గ్రాంట్లపై పెద్దఎత్తున ఆశలు పెట్టుకోవడంతోనే అంకెలు పైకి ఎగబాకినట్లు చెబుతున్నాయి. సొంత ఆదాయం 31 శాతం ఉండగా, మరో 69 శాతం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లపై ఆధారపడినట్లుగా అంచనాలు పరిశీలిస్తే స్పష్టమవుతోంది.





ప్రజలపై రూ.100 కోట్ల బాదుడు

గతేడాది సొంత ఆదాయం అంచనా కంటే ఈ ఏడాది మరో రూ.100కోట్ల మేరకు అదనంగా అంచనాలు తయారు చేశారు. ప్రజలపై ఆస్తిపన్ను, భవన నిర్మాణాలపై అదనపు భారం పడనుంది.

వాస్తవంగా బల్దియాకు వచ్చే రాబడుల్లో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుకోవడంలో బల్దియా పూర్తి వైఫల్యం చెందుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతి, పట్టింపులేనితనంతో రూ.కోట్ల సొమ్ము సమకూరడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో వేల సంఖ్యలో అక్రమ కమర్షియల్ నల్లాలు ఉన్నా వాటిని క్రమబద్ధీకరించి, ఆదాయాన్ని మెరుగుపర్చుకోవడంలో అట్టర్‌ఫ్లాప్ అవుతోంది. వ్యాపార ప్రకటనలు, ట్రేడ్ లైసెన్స్, కమర్షియల్ యూజర్‌చార్జీలు, వాస్తవ ఆస్తిపన్నుల హేతుబద్ధీకరణలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది.



వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం

రాబోయే ఏడాది ఆర్థిక బడ్జెట్ అంచనాలపై కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలపై పాలక, ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. కౌన్సిల్‌లో అధికార పక్షం తీరును నిలదీసేందుకు ప్రతిపక్షాలు సై అంటుంటే సమర్థవంతంగా ఎదుర్కొని జవాబుదారీగా నిలుస్తామని పాలకవర్గం పెద్దలు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్‌ఎస్‌ఎస్ అమలు : సీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగే పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షల సమయంలో 163 బీఎన్‌ఎస్‌ఎస్ అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్‌ఎస్‌ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. సెంటర్లకు 5 కిలోమీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులు గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రచారాలు నిర్వహించరాదని, డీజేలు వినియోగించవద్దని వివరించారు. కేంద్రాల సమీపంలో పరీక్ష సమయంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

పూర్తిస్థాయిలో కల్యాణ మండపం నిర్మించాలి



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండప పనులు పూర్తి స్థాయిలో జరగాలని రాష్ట్ర హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి, బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. బుధవారం ఉదయం జస్టిస్ చంద్రయ్య, రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ నారాయణ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఈఓ అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు వారిని ఘనంగా స్వాగతించారు. వారు స్వామివారిని దర్శించి బిల్వార్చన చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ.. కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయంలో భక్తులకు వేసవిలో తగిన సౌకర్యాలు కల్పించాలని, ఆలయ విశిష్టతను తెలిపేందుకు పూర్తి స్థాయిలో గైడ్‌ను నియమించాలన్నారు. వారి వెంట జిల్లా కోర్టు సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు


విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన పరీక్షల్లో హనుమకొండ జిల్లాలో 55 కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 20,568 మందికిగాను 19,873మంది విద్యార్థులు హాజరయ్యారు. 695మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు.

డీటీఎఫ్ వరంగల్ జిల్లా నూతన కమిటీ

వరంగల్: డీటీఎఫ్ వరంగల్ జిల్లా నూతన కమిటీని వరంగల్‌లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.గోవిందరావు, ఉపాధ్యక్షులుగా డి.మహేందర్‌రెడ్డి, ఎస్.సుధారాణి, డి.రవీందర్, కార్యదర్శులుగా ఎం.రామస్వామి, టి.సూరయ్య, టి.ఆనందాచారి, కె.నర్సింహులు ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.జాన్‌నాయక్, టి.అరుణ, ఆర్.రాంరెడ్డి, కె.కొమ్మయ్య, వి.సదానందం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.రమేశ్, సభ్యులుగా డి.శ్రీనివాస్, టి.యాకయ్యలను ఎన్నుకున్నారు.

అభివృద్ధి మాట.. సంక్షేమ బాట

బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు.. మహిళా పథకాలకు పెద్దపీట



మహిళలకు పెద్దపీట

ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాముల ఏర్పాటు.. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం మహిళా స్వయం సహాయక సంఘాలకు మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యత అప్పగిస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని 48,717 మహిళా స్వయం సహాయక సంఘాల్లోని 8,76,906 మందికి లబ్ధి చేకూరనుంది.


- విద్య, వైద్య రంగాలకు కేటాయింపులపై భిన్నస్వరాలు
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎయిర్‌పోర్టు, 'సూపర్' ప్రస్తావన లేదు
- కాళేశ్వరానికి రూ.2,685 కోట్లు.. దేవాదులకు రూ.245 కోట్లు
- స్మార్ట్‌సిటీకి రూ.179, కేయూసీ, జీడబ్ల్యూఎంసీకి రూ.100 కోట్లు
- రామప్ప, పాకాలకు రూ.ఐదేసి కోట్లు.. 'కాళోజీ'కి రూ.రెండు కోట్లే
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఊతం
- ఎకో టూరిజం ప్రస్తావన.. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆశలు

ఉమ్మడి వరంగల్‌కు నిధుల ప్రతిపాదనలు ఇలా..

బడ్జెట్ కేటాయింపుల్లో ప్రత్యక్షంగా ఉమ్మడి వరంగల్‌కు ప్రతిపాదించిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి. సాగునీటిరంగం కేటాయింపుల్లో జేఎస్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ నుంచి ఉమ్మడి ఏడు జిల్లాలకు విస్తరించి ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.2,685 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో పనుల కంటే పెండింగ్ బిల్లుల చెల్లింపులకే ఎక్కువ ప్రాధాన్యం ఉండే అవకాశం ఉంది.

- ప్రస్తుతం 91 శాతం పనులు పూర్తయి.. భూసేకరణ జరగక అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు కోసం రూ.245 కోట్లు ఇచ్చారు. ఏఐబీపీ కింద రెండు పద్దుల్లో మరో రూ.58 కోట్లను పేర్కొన్నారు.
- స్మార్ట్‌సిటీ పనుల కోసం రూ.179.09 కోట్లు, ఎస్సారెస్పీ స్టేజ్–2కు రూ.25 కోట్లు, కాకతీయ యూనివర్సిటీకి రూ.50 కోట్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు కేటాయించారు. మామునూరు వెటర్నరీ సైన్స్ కళాశాలకు రూ.25 కోట్లు, కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.10 కోట్లు, టీఎస్ స్పోర్ట్స్ స్కూల్స్ కోసం వరంగల్, కరీంనగర్‌కు కలిపి రూ.41 కోట్లు ప్రతిపాదించారు.
- రామప్ప, పాకాలకు ఐదేసి కోట్ల రూపాయలు, లక్నవరానికి రూ.2 కోట్లు, మల్లూరువాగుకు రూ.కోటి, కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి రూ.2 కోట్లు బడ్జెట్‌లో ప్రకటించారు.

రైతులు, రైతుకూలీలకు బీమా..



ఉమ్మడి వరంగల్‌లో 15,01,109 ఎకరాల్లో 4,33,229 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 4,09,098 మంది రైతులకు బీమా సౌకర్యం కొనసాగనుంది. 9,02,099 ఎకరాలకు పంటల బీమా వర్తించనుంది. అలాగే, రైతు కూలీలకు బీమా వర్తింపజేసే ప్రతిపాదనలు తక్షణమే అమల్లోకి వస్తే.. ఉమ్మడి జిల్లాలో 18,45,326 మందికి ప్రయోజనం కలుగుతుంది.

సాక్షి ప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీలో ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు దక్కిన ప్రాధాన్యంపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు పోటీగా అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో ఆ మేరకు ప్రాధాన్యం ఇవ్వలేదన్న చర్చ జరుగుతోంది. అదే సమయంలో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు చేసిన కేటాయింపుల్లోనే ఉమ్మడి వరంగల్‌కు ప్రయోజనాలు కలుగుతాయన్న మరో వాదన వినిపిస్తోంది. సీఎంగా మొదటిసారి వరంగల్‌లో పర్యటించిన రేవంత్‌రెడ్డి.. నగర అభివృద్ధి కోసం 8 అంశాలు ప్రాధాన్యంగా రూ.6,115 కోట్ల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సూపర్ ఆస్పత్రి, ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు, ఎయిర్‌పోర్టు తదితర అంశాలు అందులో ఉన్నాయి. వీటికి నేరుగా నిధులు ఇచ్చినట్లు బడ్జెట్‌లో కనిపించలేదు. కాగా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లుగా కనిపించిందన్న చర్చ ఉంది.

విద్యారంగానికి మంచి రోజులు..



ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రోత్సహించడానికి ఈసారి రూ.23,108 కోట్లు కేటాయించింది. దీంతో సర్కారు చదువులకు ఇంకా మంచి జరగనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. 20–25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించ తలపెట్టిన ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి జిల్లాకు రూ.1400 కోట్లతో ఏడింటిని మంజూరు చేసింది. ఈ బడ్జెట్‌తో ఈసారి ఆ స్కూళ్లు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. అలాగే, వరంగల్‌లో మొత్తం 3,331 ప్రభుత్వ బడులు ఉండగా, అందులో 4,67,011 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీలతోపాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈసారి నిధులు వెచ్చించే అవకాశం ఉంది.

బడ్జెట్‌పై వివిధ వర్గాల అభిప్రాయాలు II లో▸

అందరినోటా ఆరు గ్యారంటీలు..



కాంగ్రెస్ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో చేర్చిన ఆరు గ్యారంటీ పథకాలకు ఈ బడ్జెట్‌లోనూ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 8,77,173 మంది రైతులకు రైతుభరోసా పథకం ఈ ఏడాది కూడా అమలు కానుంది. ఒక కార్పొరేషన్, 9 మున్సిపాలిటీలు, 1,708 గ్రామపంచాయతీలుండగా మహాలక్ష్మి పథకం కింద సుమారు ప్రతి మహిళకు రూ.2.500 చొప్పున సుమారు 7.21 లక్షల మందికి అందే అవకాశం ఉంది. ఆర్టీసీ బస్సుల్లో వరంగల్ రీజియన్‌లో రోజుకు సగటున సుమారు 55 వేల మంది మహిళలు ఉచితంగా రాకపోకలు సాగించేందుకు ఢోకా లేదు. అదేవిధంగా గ్యాస్ సిలిండర్ కనెక్షన్లపై రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంలో 6,10,220 మంది లబ్ధిదారులకు కొనసాగనుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటికే 2.50 లక్షల మందిని రెవెన్యూ అధికారులు అర్హులుగా గుర్తించగా, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లలోపు కరెంట్ వాడిన 6,12,901 మందికి ఉచిత విద్యుత్ సౌకర్యం కలగనుంది.

సంక్షేమం, ఐటీ, అభివృద్ధిపైన ఆశలు



ఎస్సీ, బీసీ, ఎస్టీ, మహిళా సంక్షేమం కోసం ఈసారి భారీ కేటాయింపులే జరిగాయి. అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా కలిగిన జిల్లాలో ఆ వర్గాలకు మేలు జరుగనుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఎస్సీ సంక్షేమం కోసం రూ.40,232, ఎస్టీలకు రూ.17,169 కోట్లు కేటాయించడం పట్ల ఉమ్మడి వరంగల్‌కు ప్రాధాన్యం ఉంటుందంటున్నారు. ఐటీ, పరిశ్రమల రంగంపైన దృష్టి సారించిన నేపథ్యంలో రెండో నగరంగా వరంగల్ వృద్ధి చెందుతుందన్న ఆశాభావం కూడా వ్యక్తమవుతోంది. పీఎం మిత్ర నిధులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉండగా, ఐటీ హబ్, టెక్స్‌టైల్ పార్కు, మడికొండ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఎకో టూరిజానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో ములుగు, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు మహర్దశ రానుంది.

రోగులంటే ఇంత చులకనా?

- సురేఖమ్మా.. ఎంజీఎం గోస పట్టదా?
- ఆస్పత్రి సమస్యలపై బీజేపీ మహాధర్నా

ఎంజీఎం: జిల్లా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలకు కావాల్సింది ఓట్లు మాత్రమే, వారికి పేద ప్రజల గోస.. ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు కానరావు అంటూ.. బీజేపీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు సురేఖను నమ్మి గెలిపించి మంత్రి పదవి ఇస్తే ఒరగబెట్టిందేంటని ప్రశ్నించారు. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులున్నా ఏం లాభమని ప్రశ్నించారు. ఆస్పత్రిలో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, టూడీ ఎకో, ఈసీజీ పరీక్షలు సక్రమంగా చేయని దుస్థితి నెలకొందన్నారు. ఓరుగల్లు రెండో రాజధానిగా పేర్కొంటున్న సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు ఆస్పత్రిలో సమస్యలు తాండవం చేస్తుంటే ఒక్కసారైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఆస్పత్రికి వెంటనే అడిషనల్ డీఎంఈ పోస్టును భర్తీ చేసి పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీప్రసాద్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వన్నాల వెంకటరమణ, కుసుమ సతీశ్, రత్నం సతీశ్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, సముద్రాల పరమేశ్వర్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న గంటా రవికుమార్

ట్రేడ్ వసూళ్లకు 14 ప్రత్యేక బృందాలు



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- సమీక్షలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: నగర వ్యాప్తంగా కమర్షియల్ ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్ల కోసం ప్రత్యేకంగా 14 బృందాలను ఏర్పాటు చేసినట్లు బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. బుధవారం కమర్షియల్ ట్రేడ్ పన్ను వసూళ్లపై ప్రజారోగ్య విభాగ ఉన్నతాధికారులు డిప్యూటీ కమిషనర్లతో ఏర్పాటు చేసిన సమీక్షలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలిచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కమర్షియల్ ట్రేడ్ వసూళ్లను వేగవంతం చేయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు జవాన్లతో కాజీపేట సర్కిల్‌కు 7, కాశిబుగ్గ సర్కిల్‌కు 7 బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. కేటాయించిన ప్రాంతాల్లో ప్రతీ రోజు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న కమర్షియల్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి ట్రేడ్ వసూళ్లు జరిపేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, ఐటీ మేనేజర్ రమేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటర్ల నమోదుకు సహకరించాలి

నూతన ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి/బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పలు సూచనలిచ్చారు. అర్హులు తప్పకుండా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కుసుమ శ్యామ్‌సుందర్, బాకం హరిశంకర్, రజనీకాంత్, ఎండీ హెబ్‌దుల్ల తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్: జిల్లాలో ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారని, జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 49 మంది ముఖ్య పర్యవేక్షకులు, 49 మంది శాఖ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నలుగురు కస్టోడియన్లు, 461 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, డీఈఏసీ కె.అరుణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, అధికారులు పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి ఆధ్వర్యంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. జిల్లా కమిటీ సభ్యులు దివ్యాంగుల సమస్యలను వివరించారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద స్పందించి సంబంధిత చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, జీడబ్ల్యూఎంసీ డీసీ రాజశేఖర్, డీఈఓ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై సమీక్ష

సమ్మర్ యాక్షన్‌ప్లాన్, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ఆర్ఎస్ అంశాలపై వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ప్రొసీడింగ్ ఇస్తే ప్రజలు ముందుకు వస్తారని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' సేవలు వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌ఓ అప్పయ్య

మడికొండ: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవల్ని ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. ధర్మసాగర్ పీహెచ్‌సీ పరిధి ఉనికిచర్ల, హసన్‌పర్తి పీహెచ్‌సీ పరిధిలోని దేవన్నపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలను బుధవారం అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మాన్ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, లెప్రసీ సర్వే, ఎన్‌సీడీ రీస్క్రినింగ్ వివరాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రూతమ్, హెల్త్ అసిస్టెంట్ సంతోశ్, మురళి, ఏఎన్ఎంలు అరుణ, రమ్యశ్రీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు

జనగామ: ఆటోను అజాగ్రత్తగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌కు జనగామ కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. సీఐ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. 2016లో నర్మెట మండలం కన్నెబోయినగూడెం నుంచి అదే గ్రామానికి చెందిన ధారావత్ టీక్యా, నర్మెటకు చెందిన శిరీష, ఆమె తల్లి కనకలక్ష్మితో పాటు మరో ఐదుగురు ఆటోలో జనగామకు బయలుదేరారు. లింగాలఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన ఆటో డ్రైవర్ యోహాన్ అజాగ్రత్త, అతివేగం నడపడం వల్ల జనగామ మండలం గానుగుపహాడ్ దాటిన తర్వాత వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో టీక్యా అక్కడికక్కడే మృతి చెందగా, కనకలక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. అప్పటి సీఐ ముస్కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, అసిస్టెంట్ పీపీ కిరణ్ కుమార్ వాదించారు. కోర్టు కానిస్టేబుల్ టి.రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, ఇరువురి వాదనలు విన్న జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.శశి.. నిందితుడు యోహాన్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

నేడు మామిడి మార్కెట్ ప్రారంభం



మార్కెట్ కోసం స్థలం పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధి లక్ష్మీపురం ఫ్రూట్ మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నందున ఈ ఏడాది మామిడి సీజన్ నిర్వహణ కోసం ఏనుమాముల ముసలమ్మకుంట పక్కనే మార్కెట్ స్థలంలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం ఉదయం రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఈమార్కెట్‌ను ప్రారంభించనున్నట్లు వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి తెలిపారు. కాగా.. కరోనా సాకుతో నాలుగేళ్ల క్రితం ధర్మారంలోని ఓ ప్రైవేట్ గోదాంలో మామిడి మార్కెట్‌ను ఓపెన్ చేసి ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా వ్యాపారులు ఇన్నాళ్లు కొనసాగించారు. దీంతో మార్కెట్ కమిటీ పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోయింది. ముసలమ్మకుంట పక్కన మార్కెట్‌కు సంబంధించిన 10 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారుల నుంచి అనుమతులు రావడంతో మంత్రి చేతుల మీదుగా మామిడి మార్కెట్‌ను ప్రారంభిస్తున్నట్లు సమాచారం.

ఈఆర్‌సీకి సమస్యల గోడు

చైర్మన్‌కు వివరించిన విద్యుత్ వినియోగదారులు
- సీజీఆర్ఎఫ్ సేవలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజ్ నాగార్జున్
- వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



బహిరంగ విచారణకు హాజరైన టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు, విద్యుత్ వినియోగదారులు



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ నియంత్రణ మండలికి వినియోగదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన రిటైల్ సప్లయ్ వ్యాపారానికి సమగ్ర ఆదాయ అవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ఆధ్వర్యతన బహిరంగ విచారణ జరిగింది. ఈ విచారణలో టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి.. సంస్థ ద్వారా వినియోగాదారులకు అందిస్తున్న సేవలు వివరించారు. విద్యుత్ చార్జీలు పెంచడం లేదని చెప్పారు. ఆధునిక సాంకేతికను వినియోగించి వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్పీడీసీఎల్‌లో అమలు చేస్తున్న సాంకేతిక పద్ధతులు, సంస్థను వినియోగదారులకు చేరువ చేసిన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

బాధితులకు ఈఆర్‌సీ చైర్మన్ చేతుల మీదుగా చెక్కు అందజేత..

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదురుగడ్డకు చెందిన అంగిడి అనిత, రాజ్ కుమార్ దంపతుల ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైందని, ఈ ఘటనలో వారి కుమారుడు సాయి కుమార్(07) చనిపోయాడని, ఇంటి పైనుంచి విద్యుత్ లైన్ వెళ్లడం ద్వారానే ఈ ఘటన జరిగిందని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి జోగినిపల్లి సంపత్‌రావు ఈఆర్‌సీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులను ఈఆర్‌సీ ముందుంచి వారి బాధను వివరించారు. ఈ ఘటన జరిగి 5 నెలలవుతున్నా ఎలాంటి పరిహారం చెల్లించలేదని తెలిపారు. స్పందించిన ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ పరిహారం చెల్లించాలని సూచించారు. దీంతో బహిరంగా విచారణ సభలోనే ఈఆర్‌సీ చైర్మన్ చేతుల మీదుగా బాధితులు అనితా, రాజ్‌కుమార్ దంపతులకు రూ.5 లక్షల చెక్కు అందించారు.

సీజీఆర్ఎఫ్ సేవలు విస్తృతం చేయాలి..

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) సేవలను మరింత విస్తృతం చేయాలని ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అధికారులకు సూచించారు. దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సేవలకు ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు.

విద్యుత్ చార్జీలు పెరగవు..

టీజీ ఎన్పీడీసీఎల్ రెవెన్యూ లోటు రూ.10,393 కోట్లు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నిర్వహణకు రూ.19,814 కోట్ల ఆదాయం అవసరం కాగా, రూ.9,421 కోట్లు మాత్రమే ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో రెవెన్యూ భారీ లోటు ఏర్పడనుంది. ప్రభుత్వం ఈ మేరకు రీయింబర్స్ చేయాల్సిన అవసరముంది. అదే విధంగా ఈ సంవత్సరం విద్యుత్ చార్జీల టారిఫ్ పెంపుపై ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. దీంతో విద్యుత్ చార్జీలు పెరగవు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి భారం పడదు.

ఈఆర్‌సీ చైర్మన్‌కు సమస్యలు విన్నవించిన వినియోగదారులు



బహిరంగ విచారణకు అధ్యక్షత వహించిన ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి వినియోగదారులు హనుకొండ కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలను ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్‌కు వివరించారు. వీరితో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు వినియోగదారులకు జరుగుతున్న ఇబ్బందులు, కంపెనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందించారు. ఆగ్రో బేస్డ్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్‌లో రాయితీ ఇవ్వాలని వినియోగదారులు కోరారు. రాయితీ లేక ఈ రంగంలో పరిశ్రమలు రావడం లేదన్నారు. అదే విధంగా 2011లో ట్రాన్స్‌కో రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాల మేరకు కాటన్ ఇండస్ట్రీస్ నడిపిస్తే ఆ తర్వాత జరిమానా విధించారని వాపోయారు. వడ్డీ విధిస్తూ ఎరియర్స్‌గా చూపిస్తున్నారని, 18 ఇండస్ట్రీస్‌కు రూ.15 నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా విధించారని, వీటిని రద్దు చేయాలని కోరారు. రైతులు తమ వ్యవసాయ మోటార్ల వద్ద ఓల్టేజీ తెలుసుకోవడానికి 20 ఆంప్స్ విద్యుత్ బల్బులు వాడుకునేందుకు అనుమతి ఉందని, అయితే న్యూట్రల్ వైర్ లేక వినియోగించుకోలేక పోతున్నామని, వ్యవసాయ సర్వీస్ లైన్‌లకు న్యూటల్ లైన్ వేయాలని కోరారు. అదే విధంగా పంట పొలాల మధ్య ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతానికి తరలించడానికి రైతులను డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, దీనికి స్వస్తి పలికి సంస్థనే ఉచితంగా తరలించాలని కోరారు. రైతులు మారినప్పుడు వ్యవసాయ సర్వీస్‌లో పేర్లు మార్చే విధానం సులభతరం చేయాలని కోరారు. చాలా గ్రామాలకు జూనియస్ లైన్‌మెన్లు, లైన్‌మెన్‌లు లేరని, వెంటనే నియమించాలని కోరారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను ఎలాంటి చార్జీలు విధించకుండా మార్చాలని కోరారు. వినియోగదారులు ఇంకా చాలా సమస్యలు ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరించాలని ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్..టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిని ఆదేశించారు.

భారత రాజ్యాంగం.. సెక్యులర్ వ్యవస్థ



మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రయ్య



మాట్లాడుతున్న హరగోపాల్



మాట్లాడుతున్న సీతారాంనాయక్

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య
- కేయూలో ముగిసిన జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ : భారత రాజ్యాంగం సెక్యులర్ భావాలతో కూడిన వ్యవస్థని, రాజ్యాంగం ఒక వర్గానిదో.. ఒక కులానిదో కాదని, దేశ ప్రజలందరిదని తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారత రాజ్యాంగం– మైలురాళ్లు– సమస్యలు– సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతీ వ్యక్తి భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తోపాటు రాజ్యాంగాన్ని కూడా అధ్యయనం చేయాలన్నారు. అప్పుడే రాజ్యాంగం విలువలు, తమ హక్కులేమిటో తెలుస్తాయన్నారు. సమసమాజ నిర్మాణం కోసం రాజ్యాంగం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశ ప్రజల హక్కులను రక్షించేది రాజ్యాంగమేనని, రాజ్యాంగాన్ని సమగ్రంగా రచించిన గొప్ప వ్యక్తి బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. దేశ ప్రజలు అంబేద్కర్‌కు రుణపడి ఉండాలన్నారు. రాజ్యాంగం వైరుధ్యాలను పరిష్కరిస్తుందన్నారు.

రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలి..

భారత రాజ్యాంగం ప్రపంచంలో గొప్పదని మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. చట్టసభల్లో అట్టడుగు వర్గాల వారు ప్రవేశించడానికి రాజ్యాంగంలో పేర్కొన్న రిజర్వేషన్ విధానమే కారణమన్నారు. రాజ్యాంగానికి లోబడే ఎవరైనా వ్యవహరించాలేగాని రాజ్యాంగ పరిధి దాటి వ్యవహరిస్తే ప్రతికూల ప్రభావాలు చూపుతాయన్నారు. అనంతరం కేయూ యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఆర్. మల్లికార్జున్ రెడ్డి, కేయూ ఎస్సీ,ఎస్టీ సెల్‌డైరెక్టర్, ఈ సెమినార్ డైరెక్టర్ తుమ్మల రాజమణి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నారాయణ మాట్లాడారు. లైబ్రరీ సైన్స్‌విభాగం అధిపతి రాధిక రాణి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

రాజ్యాంగ వ్యవస్థను గత 75 సంవత్సరాలుగా ప్రజలు గౌరవిస్తున్నారని, రాజ్యాంగానికి లోబడి రాజ్య పాలన నిర్వహించాలని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, హెచ్‌సీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. కానీ నేడు పాలకులు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థకు తిలోదకాలు ఇచ్చి సొంత ఎజెండాతో పాలన కొనసాగిస్తున్నారన్నారు.

హెల్త్ యూనివర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ



ఎంజీఎం: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి బుధవారం అధికారికంగా తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ ప్రతిష్టను పెంచేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అనంతరం వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి సిబ్బందితో ముచ్చటించారు. నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన నందకుమార్‌రెడ్డికి రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ మల్లేశ్వర్, జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ రమేశ్, అడ్మిషన్ కమిటీ మెంబర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ హేమంత్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ ఖాలీద్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సునీతావిలియమ్స్ భావితరాలకు స్ఫూర్తి..



యమ్స్ 9 నెలల సమయంలో అంతరిక్షంలో 150కి పైగా ప్రయోగాలు నిర్వహించారు.

భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతావిలియమ్స్ భావితరాలకు స్ఫూర్తి అని పలువురు సైన్స్ మాజీ అధికారులు, ప్రొఫెసర్లు అన్నారు. ప్రయోగాల నిమిత్తం 9 నెలల క్రితం అంతర్జాతీయ అంతరిక్షంలోకి వెళ్లిన సునీతావిలియమ్స్ బుధవారం తెల్లవారుజామున భూమిపై సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. దీనిపై భారత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాగా, సునీతావిలియమ్స్ 9 నెలల సమయంలో అంతరిక్షంలో 150కి పైగా ప్రయోగాలు నిర్వహించారు.

–కాజీపేట అర్బన్

టెక్నాలజీకి హ్యూమన్ స్పిరిట్ తోడు



టెక్నాలజీకి హ్యూమన్ స్పిరిట్ తోడవడంతోనే సునీతా విలియమ్స్ ధైర్యంగా పరిశోధనలకు అంతరిక్షంలోకి వెళ్లింది. ఎనిమిది రోజుల కోసం అంతరిక్షం వెళ్లి అక్కడే చిక్కుకుంది. 9 నెలలు వివిధ ప్రయోగాలు నిర్వహించింది. బుధవారం తెల్లవారుజామున క్షేమంగా భూమిపై ల్యాండ్ అయ్యింది. సునీతా విలియమ్స్ అంతరిక్ష పరిశోధనలు చేపట్టేందుకు యువ శాస్త్రవేత్తలకు దిక్సూచిగా నిలుస్తారు.

–అబ్దుల్ అజీమ్, ఫిజిక్స్ ప్రొఫెసర్, నిట్

సైన్స్ చరిత్రలో మైలు రాయి



మూడోసారి పరిశోధనల కోసం గతేడాది జూన్ 5వ తేదీన అంతరిక్షంలోకి వెళ్లిన సునీతా విలియమ్స్ 284 రోజుల తర్వాత భూమి మీదకు సురక్షితంగా చేరుకోవడం సైన్స్ చరిత్రలో మైలు రాయి. అంతరిక్షయానంలో ఉపయోగించే రాకెట్‌లలో లోపాలను ముందుగానే గుర్తించి సాంకేతికత ముందుగానే ఉంటే కల్పనా చావ్లా వంటి అంతరిక్ష పరిశోధకులను కోల్పోయేవాళ్లం కాదు. అయితే సునీతావిలియమ్స్ సమస్యలను ఎదుర్కొని మొక్కవోని ధైర్యంతో తిరిగి భూమి మీదకు రావడం ఆనందంగా ఉంది.

–సురేశ్‌బాబు, సైన్స్ మాజీ అధికారి

మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో పరిశోధనలు అభినందనీయం



మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో పరిశోధనల కోసం సునీతా విలియమ్స్ చేపట్టిన ప్రయాణం మానవ విజ్ఞానానికి నూతన ప్రేరణ కలిగిస్తుంది. సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటూ సునీతావిలియమ్స్ తన బృందంతో కలిసి సురక్షితంగా భూమికి తిరిగి రావడం ఆమె ధైర్యం, నైపుణ్యం, పట్టుదలకు నిదర్శనం. సునీతా విలియమ్స్ భవిష్యత్‌కు స్ఫూర్తిగా నిలుస్తారు.

–భూత్కూరి శ్యాంసుందర్‌రెడ్డి, సైన్స్ మాజీ అధికారి

సునీతావిలియమ్స్ రాక దేశానికే గర్వకారణం



భారత సంతతికి చెందిన అమెరికన్ ఆస్ట్రోనాట్ సునీతావిలియమ్స్ అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టి తిరిగి భూమిపైకి రావడం దేశానికే గర్వకారణం. అంతరిక్ష పరిశోధనల్లో మహిళల పాత్రను నేటి తరానికి తెలియజేసిన సునీతావిలియమ్స్ యువ సైంటిస్టులకు ఆదర్శంగా నిలుస్తారు.

–కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ మాజీ కోఆర్డినేటర్

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

సంక్షేమ బడ్జెట్..



కేయూ క్యాంపస్: 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఇందులో రాజీవ్ యువ వికాస్ పథకానికి రూ. ఆరువేల కోట్లు కేటాయించారు. దీని వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యంగ్ స్కిల్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిటీ ఏర్పాటుతో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. ఈ బడ్జెట్‌తో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుంది.

–సురేశ్‌లాల్, ప్రొఫెసర్, కేయూ ఎకనామిక్స్ విభాగం

విద్యారంగానికి 7.57 శాతమే



కేయూ క్యాంపస్: ఈ సారి బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపుల్లో 1,816 కోట్లు పెరిగినా మొత్తం బడ్జెట్‌లో రూ. 3 లక్షల కోట్లలో చూసినప్పుడు రూ. 23 వేల కోట్లు వరకు కేటాయించారు. 7.57 శాతమే కేటాయింపులు జరిగాయి. ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అధిక నిధులు కేటాయించారు. స్వాగించాల్సిందే. కానీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అమలు చేయాలంటే 15 శాతం నిధులు కేటాయించాల్సిండేది.

–భీమళ్ల సారయ్య, విద్యావారధి సంస్థ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

విద్యకు ప్రాధాన్యమివ్వని బడ్జెట్



కేయూ క్యాంపస్: ప్రభుత్వ బడుల వసతుల కల్పనలో జాతీయ స్థాయిలో తెలంగాణ 32వ స్థానంలో ఉండగా.. నాణ్యమైన విద్య, సమర్థంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని తెలంగాణ విద్యా కమిషన్ తెలిపింది. అయితే ఆ స్థితిని మెరుగు పరిచేలా ప్రభుత్వం రెండో బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమివ్వలేదు. రూ. 3,04,965 కోట్లలో విద్యకు రూ.23,108 కోట్లు కేటాయించారు. (7.57 శాతం) ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి ఏ మాత్రం సరిపోవు.

–కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి

ఉద్యోగుల కరువు భత్యం గురించి ప్రస్తావన లేదు



కేయూ క్యాంపస్: ఈ బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కరువు భత్యం ఇచ్చేందుకు నిధులు కేటాయించలేదు. పీఆర్‌సీ గురించి ప్రస్తావనలేదు. విద్యాశాఖ పరిధిలో మౌలిక సదుపాయల కల్పన, మెరుగైన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య, తదితర అంశాలకు విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాల్సిండేది.

– పెండెంరాజు, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

నీటిపారుదల రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి



జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నీటి పారుదల రంగానికి మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణం, భూసేకరణ వందశాతం జరగాలంటే నీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. 70 శాతం వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపాలంటే ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు సాగు పెంచాలంటే నిధుల కేటాయింపు అధికంగా ఉండాలి.

–గోపు బాలశౌరెడ్డి, గుంటూరుపల్లి, నర్మెట, జనగామ జిల్లా

మోసపూరిత బడ్జెట్



జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితంగా ఉంది. ప్రభుత్వం చెప్పే మాటలకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు పొంతన లేకుండా ఉంది. ముఖ్యమైన రంగాలను విస్మరించారు. మహిళల భవిష్యత్‌కు భరోసా, భద్రత లేదు. గత ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలనే ఈ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయడం లేదు.

–అనంతోజు రజిత, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి, పాలకుర్తి

బడ్జెట్‌ను సవరించాలి..



నర్సంపేట: వ్యవసాయ రంగానికి కనీసం 10 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం శోచనీయం. ఆశలు బారెడు, ఆచరణ మూరెడులా ఉంది. ఎన్నికల హామీలు నెరవేర్చే విధంగా బడ్జెట్‌ను సవరించాలి. అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకుంటోంది. వ్యవసాయానికి కేవలం రూ.24,349 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడం సరికాదు.

– పెద్దారపు రమేశ్, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా సంక్షేమాన్ని విస్మరించారు..



నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని విస్మరించే విధంగా బడ్జెట్ తయారు చేసింది. ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని, మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చడం లేదు. బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులను కేటాయించాలి. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తాం.

వంగల రాగసుధ, ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి

గిరిజన సంక్షేమ బడ్జెట్..



మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం శుభపరిణామం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గిరిజన పక్షపాతి అని ఈ బడ్జెట్ చూస్తే అర్థం అవుతుంది. బడ్జెట్‌లో షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడంతో గిరిజన సంక్షేమానికి, విద్య, ఆరోగ్యం, ఉపాధివంటి రంగాల్లో మరింత అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి.

–భూక్య స్రవంతి, మహబూబాబాద్

ఉన్నత విద్యకు తక్కువ నిధులు..



భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉన్నత విద్యకు తక్కువ నిధులు కేటాయించింది. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తావన లేదు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు సుమారు రూ.11,600 కోట్లు నిధులు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న గురుకుల పరిస్థితి ఏమిటి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఊసే లేదు. డిగ్రీ కళాశాలల సొంత భవనాలకు నిధులు లేవు. ఈ నిధులు విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా లేవు.

– జోసెఫ్, ఏఐఎస్ఎఫ్, నాయకుడు

కేటాయింపులు కాదు.. అమలు చేయాలి



కొత్తగూడ: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గిరిజన సంక్షేమం కోసం రూ.17,169 కోట్ల కేటాయించడం హర్షణీయమే. అయితే కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా చూడాలి. లెక్కలలో చూపి కేటాయింపులు చేయకుండా ఇప్పటి వరకు మోసం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో నిధులు విడుదల చేయడంతో పాటు ఆదివాసీ ప్రాంతాలకు ఉపయోగపడేలా చూడాలి.

సిద్ధబోయిన భిక్షమయ్య, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు


స్వల్పంగా పెరిగినా సరిపోని కేటాయింపులు



భూపాలపల్లి అర్బన్: బడ్జెట్‌లో విద్యాశాఖకు గత ఏడాది కంటే రూ.1,816 కోట్లు స్వల్పంగా పెరిగినా సరిపోని కేటాయింపులు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం హామీకి ఆమడ దూరంలో ఉంది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067వేల ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసి రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల గురించి మాత్రమే మాట్లాడుతోంది. విద్యారంగానికి కేవలం 7.57శాతం బడ్జెట్ కేటాయించడం శోచనీయం.

– నక్క తిరుపతి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆశించినంతగా బడ్జెట్ లేదు..



ఏటూరునాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించినంతగా బడ్జెట్ ప్రవేశపెట్టలేదు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆశాజనకంగా లేకపోవడం బాధాకరం. పేద వర్గాలకు విద్య, వైద్యానికి బడ్జెట్ పెంచి, తాగునీటి వసతులకు మరిన్ని సౌకర్యాలు పెంచాల్సి ఉంది. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను మరింతగా తగ్గించే విధంగా ప్రభుత్వం కృషి చేయాల్సి ఉంది.

–జాడి స్వప్న, ఏటూరునాగారం

న్యూస్‌రీల్

వీసీని కలిసిన పోలీస్ కమిషనర్



కేయూ క్యాంపస్: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని బుధవారం యూనివర్సిటీలో కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం అందించారు. కాగా.. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి వీసీ కె.ప్రతాప్‌రెడ్డి సన్మానించారు. అనంతరం వర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ఎర్రగట్టు జాతర ఆదాయం రూ.16,33,296



హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయ జాతర ఆదాయం రూ.16,33,296 వచ్చినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఈఓ వెంకట్‌రావు తెలిపారు. దేవస్థానంలో హుండీలను బుధవారం లెక్కించగా ఆదాయ వివరాలను వారు వెల్లడించారు. వేలం ద్వారా రూ.6,22,500, కల్యాణం ద్వారా రూ.11,160, శీఘ్ర దర్శనం ద్వారా రూ.68,800, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.1,92,450, అర్చనల ద్వారా రూ.60,700, విరాళాలు రూ.12,364, స్వామి వారి కట్నాలు రూ.6,859, కేశఖండనం ద్వారా రూ.40, గందదీపం ద్వారా రూ.36,232, హుండీ ఆదాయం రూ.5,88,225, తైబజార్ ఆదాయం రూ.33,966 వచ్చినట్లు వివరించారు. గత జాతర కంటే ఈసారి రూ.3,49,583 ఆదాయం ఎక్కువ వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు శీలం రమేశ్, కనపర్తి రాజు, సంతోశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేయూకు బ్లాక్ గ్రాంట్ రూ.145 కోట్లు

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి ఇచ్చే బ్లాక్‌గ్రాంట్ నిధులు సుమారు రూ.10 కోట్ల వరకు పెరిగాయి. ఈఆర్థిక సంవత్సరానికి (2025–26) బడ్జెట్‌లో బ్లాక్ గ్రాంట్ కింద గ్రాంట్ ఇన్ ఎయిడ్ అధ్యాపకుల, ఉద్యోగుల, పెన్షనర్ల వేతనాల కోసం రూ.114.62 కోట్లు కేటాయించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోసం రూ.31 కోట్లు కేటాయించారు. కాగా.. ఈఆర్థిక సంవత్సరానికి వర్సిటీలో డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతో మొత్తం రూ.145.62 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. గతేడాదితో పోలిస్తే రూ.10 కోట్ల వరకు పెరిగినట్లయింది. కాకతీయ యూనివర్సిటీ వీసీగా కె.ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి కొన్ని నెలలవుతోంది. పలు మార్లు ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి యూనివర్సిటీకి బ్లాక్ గ్రాంట్ పెంచాలని, అభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. ప్రతిపాదనలు కూడా పంపారు. అందుకు వీసీ కృషి చేయడంతో కేటాయించిన నిధులు పెరిగినట్లు భావిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో నిధులు పెరగడంతో అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మానుకోటలో మహిళ ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: తనతో సహజీవనం చేస్తున్న వ్యక్తి తనకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఓ మహిళ బీపీ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ ఒక ఎస్సైతో సహజీవనం చేస్తున్నట్లు సమాచారం. కాగా.. ఆయన తాను పనిచేస్తున్న ప్రాంతంలో మరో మహిళతో సన్నిహితంగా ఉండగా.. పద్ధతి మార్చుకోమని చెప్పగా పట్టించుకోలేదని తెలిసింది. ఈ క్రమంలో సదరు మహిళ మానసిక వేదనకు గురై మానుకోటలోని జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. కాసేపటికే ఇంటికి వెళ్లిపోయినట్లు సమాచారం.

మాడవీధుల మణిహారం!

- శరవేగంగా భద్రకాళి ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణం
- పనులు పూర్తయితే ఆలయానికి మరింత శోభ



మాడవీధులు, గోపురాలు, రోడ్లతో భద్రకాళి దేవాలయం నమూనా

హన్మకొండ కల్చరల్: ప్రశాంత వాతావరణంలో.. సువిశాలమైన చెరువు అంచున ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోంది భద్రకాళి అమ్మవారి ఆలయం. టెంపుల్ టూరిజం కాన్సెప్ట్‌లో భాగంగా భద్రకాళి దేవాలయ ప్రాంగణంలో మాడవీధుల నిర్మాణం, దేవాలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.30 కోట్లు కేటాయించింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ. 20 కోట్లు, 'కుడా' నుంచి రూ.10 కోట్ల నిధులు విడుదల చేసింది. మాడవీధుల నిర్మాణాలతో పాటు భక్తుల్ని ఆకర్షించేలా ఆలయాన్ని తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ మాడ వీధుల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. చెరువు అంచున ఆలయ ప్రహరీని ఆనుకుని సుమారు 60 ఫీట్ల విస్తీర్ణంతో మొరం పోసి చదును చేస్తున్నారు.

వేగం పెంచాలి: అధికారులు

భద్రకాళి దేవాలయ మాడవీధుల నిర్మాణంలో వేగం పెంచాలని సంబంధిత దేవాదాయశాఖ, సాగు నీటిపారుదలశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. భద్రకాళి చెరువు పూడికతీతలో భాగంగా చెరువు ఖాళీ అయినందున చెరువును ముందుకు జరిపే పనులు, దేవాలయం చుట్టూ ప్రాకారాన్ని సులభంగా నిర్మించవచ్చంటున్నారు. మాడవీధుల నిర్మాణంలో వాస్తు ప్రకారం వేదపండితుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, బల్దియా, 'కుడా', రెవెన్యూ, పోలీసులతో సహా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో, నిట్ కళాశాల ప్రొఫెసర్లతో సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు.

స్పందించని 'కుడా' అధికారులు..

మాడవీధుల నిర్మాణ పనుల వివరాల గురించి 'సాక్షి'.. 'కుడా' అధికారులను అడగ్గా తెలుపలేదు. ఫోన్‌లో కూడా స్పందించలేదు. 'కుడా' డిప్యూటీ ఇంజినీర్లను వివరాలు అడగ్గా తమకు తెలియదని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను అడగాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వివరాలు తెలపడంపై స్పందించకపోవడం నిర్లక్ష్యం కనిపిస్తుంది.



వల్లభ గణపతి దేవాలయం వెనుక చదును చేసిన స్థలం


భక్తులు, దాతలు సహకరించాలి..



మాడవీధుల నిర్మాణం పూర్తయితే.. అందమైన చెరువు అంచున భద్రకాళి ఆలయం కనువిందు చేయనుంది. భవిష్యత్‌లో భక్తుల సౌకర్యార్థం విశాలమైన ఆలయ ప్రాంగణం ఉండేలా.. ఆలయం చుట్టూ అందమైన రహదారులు కనిపించేలా పనులు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపుతో పాటు పల్లకి సేవ కార్యక్రమాలు మాడవీధుల్లో నిర్వహించేలా.. లక్షలాది మంది ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు పనులు జరుగుతున్నాయి. ఆలయ చుట్టూ ప్రణాళిక ప్రకారం ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ మాఢ వీధుల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈపనుల్లో భక్తులు, దాతలు సహకరించాల్సిందిగా కోరుతున్నా.

– శేషుభారతి,
వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, భద్రకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి

నిర్మాణం ఇలా..



ఆలయం ఎదుట గోపురం నమూనా

దేవాలయం చుట్టూ నిర్మించే చతుష్పాథాలను మాడవీధులంటారు. వీటి నిర్మాణంలో భాగంగా ఆలయానికి ప్రాకారం నిర్మిస్తారు. ఈప్రాకారానికి నాలుగు దిశల్లో నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసి గోపురాలు నిర్మిస్తారు. ప్రాకార నిర్మాణంలో భాగంగా దేవాలయం పడమర, దక్షిణం దిశల్లో ఉన్న భద్రకాళి చెరువును 60 అడుగుల వరకు ముందుకు జరిపి మాడ వీధుల నిర్మాణానికి స్థలాన్ని సేకరిస్తున్నారు. ప్రస్తుతం రాళ్లు, మట్టిని నింపి సుమారు 20 అడుగుల వరకు స్థలాన్ని తయారు చేశారు. ఉత్తరం వైపు గతంలో ఉన్న వేదపాఠశాల నుంచి ప్రస్తుతం ఉన్న ప్రధాన గేటు తూర్పు వైపుగా నిర్మించనున్నారు. ఇందులో భాగంగా వేద పాఠశాల స్థలంలోని లోతును బండరాళ్లతో, మొరంతో లెవెల్ చేస్తున్నారు. అమ్మవారికి అభిముఖంగా ఉండే గోపురాన్ని రాజగోపురం అంటారు. దీన్ని 120 అడుగుల ఎత్తులో 9 అంతస్తులుగా నిర్మించనున్నారు. రాజగోపుర నిర్మాణం కోసం రూ. 20 కోట్లు అంచనా వేశారు. కాకతీయుల శిల్ప కళా నైపుణ్యంతో 7 అంతస్తులుగా మిగిలిన మూడు గోపురాలను రూ. 10 కోట్ల అంచనాతో నిర్మించనున్నారు. కాగా.. రాజగోపుర నిర్మాణాలకు దేవాలయ నిధులు, భక్తుల నుంచి విరాళాలు సేకరించనున్నారు.

బడ్జెట్‌పై సమాచారంతో సిద్ధంగా ఉండాలి..

- సమీక్షలో మేయర్, కమిషనర్



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి, చిత్రంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ప్రతీ సభ్యుడు అడిగే ప్రశ్నలకు బాధ్యతాయుతంగా సమాధానాలు అందించాల్సిన బాధ్యత మీపై ఉందని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను హెచ్చరించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో గురువారం 2025–26 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వింగ్ అధికారులతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అధికారులు ఆదాయ, వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ జోనా, సెక్రటరీ అలివేలు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో రేవంత్‌కుమార్‌కు ఫస్ట్ ర్యాంక్



వరంగల్: గేట్–2025 (అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం)లో వరంగల్ దేశాయిపేటకు చెందిన కీర్తి రేవంత్ కుమార్ జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. గేట్ పరీక్షలో 100 మార్కులకు 74.67 మార్కులు సాధించి మొదటి ర్యాంకు పొందాడు. రేవంత్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను స్థానికులు అభినందించారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

- పురుగుల మందు డబ్బాలతో భూనిర్వాసితుల ఆందోళన
- టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయినా పరిహారం ఇవ్వలేదని ఆవేదన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

వరంగల్: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం రాని కొంతమంది రైతులు హనుమకొండలోని వరంగల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మెగా టెక్స్‌టైల్ పార్కులో తమ భూములను తీసుకున్న రెవెన్యూ అధికారులు నష్టపరిహారం ఇప్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తమ బాధను ఆర్డీఓ, కలెక్టర్ తెలిపేందుకు వచ్చామని, ఇప్పటికైనా పరిహారాన్ని వెంటనే 15 రోజుల్లో చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పురుగుల మందు డబ్బాతో వచ్చి ధర్నా చేయడంతో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం నాయకుడు సముద్రాల యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఒకే దేశం – ఒకే ఎన్నిక'తో మేలు

- బీజేపీ నేత, న్యాయవాది రావు అమరేందర్ రెడ్డి




వర్క్‌షాపులో మాట్లాడుతున్న అమరేందర్ రెడ్డి

హన్మకొండ: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని, ఇది దేశ భవిష్యత్‌ను మార్చే నిర్ణయమని బీజేపీ నేత, న్యాయవాది రావు అమరేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నిక – బీజేపీ దృష్టి కోణం' అనే అంశంపై జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వర్క్‌షాపు జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతీ సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఏదో ఒక ఎన్నిక జరుగుతుండడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. ఈక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టితో జమిలీ ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ చైర్మన్‌గా, హోంమంత్రి అమిత్ షా, గులాంనబీ ఆజాద్, కశ్యప్ ఇలా అన్ని వర్గాల వ్యక్తులతో కమిటీ వేశారని గుర్తుచేశారు. ఆ కమిటీ నివేదిక ప్రకారం దేశంలో ఒకేసారి రాష్ట్ర, కేంద్ర ఎన్నికలు నిర్వహించి మూడు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి తర్వాత నాలుగున్నరేళ్ల పాటు ఎన్నికలు లేకుండా కేవలం పాలనపై దృష్టి కేంద్రీకరించవచ్చన్నారు. వర్క్‌షాపులో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, దొంతి దేవేందర్‌రెడ్డి, కె.సంపత్‌రెడ్డి, సంద్ర మధు పాల్గొన్నారు.

ఎమ్మార్టీలో పదోన్నతి ఎప్పుడు?

- ఖాళీగా టెస్టర్ గ్రేడ్–2 (లైన్‌మెన్) పోస్టులు
- ప్రమోషన్ కోసం జేఎల్‌ఎంల ఎదురుచూపులు



హన్మకొండ: తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో ఎమ్మార్టీ విభాగంలో పదోన్నతి కల్పించడంలో జాప్యం జరుగుతున్నా కొద్దీ.. ఉద్యోగుల్లో ఆందోళన పెరిగిపోతోంది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధి 16 సర్కిళ్ల (జిల్లా)లో 16 ఎమ్మార్టీ డివిజన్లున్నాయి. ఈడివిజన్లలో అన్ని కేడర్లు కలిపి 285 పోస్టులున్నాయి. ఇందులో 220 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో లైన్‌మెన్ పోస్టులు 47 ఖాళీగా ఉన్నప్పటికీ పదోన్నతి కల్పించి భర్తీ చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఎమ్మార్టీ విభాగానిది కీలక భూమిక. సబ్ స్టేషన్లు, డీటీఆర్‌ల నిర్వహణలో వీరి పాత్ర ముఖ్యమైంది. వీటితో పాటు సిటీ మీటర్స్, హెచ్‌టీ మీటర్స్, ఎల్‌టీ మీటర్స్ రొటేషన్ పద్ధతిలో పరీక్షిస్తుంటారు. సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ వీరిదే బాధ్యత. వీరు ఏ మాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగడమో.. నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడమో జరుగుతుంటుంది. అదే విధంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలను సరిదిద్దేదీ ఈ విభాగ ఉద్యోగులే. విద్యుత్ శాఖలో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్న వీరిపై యాజమాన్యం అనుసరిస్తున్న వివక్షతో వారంతా విసిగిపోతున్నారు.

యాజమాన్యం పట్టించుకోవట్లేదు..

ఎమ్మార్టీలో జూనియర్ లైన్‌మెన్, టెస్టర్ గ్రేడ్–2 (లైన్‌మెన్), టెస్టర్ గ్రేడ్–1 (లైన్ ఇన్‌స్పెక్టర్), ఫోర్‌మెన్ గ్రేడ్–1 పోస్టులున్నాయి. ఆపరేషన్ విభాగంలో మాదిరిగా టెస్టర్ గ్రేడ్–1 తర్వాత సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు సృష్టించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నా.. యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫోర్‌మెన్ గ్రేడ్–1 పదోన్నతి కల్పించే క్రమంలో అధికారులు వింత పోకడలు అవలంబిస్తున్నారు. అసలే పోస్టు లేని ఫోర్‌మెన్ గ్రేడ్–2గా డీగ్రేడ్ చేస్తూ ఏడాది తర్వాత ఫోర్‌మెన్ గ్రేడ్–1గా పదోన్నతి కల్పిస్తున్నారు. దీంతో ఒకే వ్యక్తికి ఒక సంవత్సరంలోనే నాలుగు ఇంక్రిమెంట్లు (రెండు పదోన్నతి) ఇస్తున్నారు. డీ గ్రేడ్ చేస్తున్న ఫోర్‌మెన్ గ్రేడ్–2 స్థానంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టును క్రియేట్ చేయాలని ఎమ్మార్టీ ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఫోర్‌మెన్ గ్రేడ్–1, ఫోర్‌మెన్ గ్రేడ్–2 పదోన్నతి అంశంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఫోర్‌మెన్ గ్రేడ్–1 పోస్టు భర్తీ చేస్తే ఫోర్‌మెన్‌గ్రేడ్–2 ఖాళీగా ఉంటుంది. ఫోర్‌మెన్ గ్రేడ్–2 భర్తీ చేస్తే ఫోర్‌మెన్ గ్రేడ్–1 ఖాళీగా ఉంటుంది. ఈరెండు పోస్టుల్లో ఒకేసారి ఉద్యోగుల భర్తీ కనిపించదు.

20 ఏళ్ల వరకు పదోన్నతి లేదా?

ఎమ్మార్టీ విభాగంలో ఆరేళ్ల నుంచి 20 ఏళ్ల వరకు పదోన్నతి పొందకుండా ఒకే పోస్టులో కొనసాగుతున్నామని ఎమ్మార్టీ ఉద్యోగులు వాపోతున్నారు. జూనియర్ లైన్‌మెన్లు టెస్టర్ గ్రేడ్–2 పదోన్నతి కోసం గత ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. టెస్టర్ గ్రేడ్–2 ఉద్యోగులు గ్రేడ్–1 కోసం 10 నుంచి 18 ఏళ్ల నుంచి, టెస్టర్ గ్రేడ్–1 నుంచి ఫోర్‌మెన్ పదోన్నతి కోసం 10 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. టెస్టర్ గ్రేడ్–2 నుంచి పదోన్నతికి అనువుగా పోస్టులు లేక పోవడంతో వీరికి అవకాశం దక్కడం లేదు. పైస్థాయిలో ఉన్న ఉద్యోగులు రిటైర్డ్ అయితేనే పోస్టు ఖాళీ అవుతుంది. అప్పుడే పదోన్నతికి అవకాశముంటుంది. ఈక్రమంలో ఈ పోస్టుల మధ్య కొత్త పోస్టులు క్రియేట్ చేస్తే పదోన్నతి చానల్ పెరుగుతుందని ఎమ్మార్టీ ఉద్యోగులు యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఖాళీగా ఉన్న టెస్టర్ గ్రేడ్–2 పోస్టులు 47 ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడంతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అంతర్యమేంటో అర్థం కావట్లేదని ఉద్యోగులు వాపోతున్నారు. దీంతో ఉద్యోగిగా తమకు రావాల్సిన ప్రయోజనాలను కోల్పోతున్నామని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు పదోన్నతి కల్పించాలని ఎమ్మార్టీ ఉద్యోగులు కోరుతున్నారు.

ఉత్పాదకతలో ఎంఎస్‌ఎంఈ పాత్ర కీలకం



మాట్లాడుతున్న దాస రాజు

హన్మకొండ: స్థూల ఉత్పాదకత, ఉపాధి కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ) కీలక భూమిక పోషిస్తోందని కామన్ వెల్త్ విజిటింగ్ ఫెల్లో యునైటెడ్ కింగ్‌డమ్, గ్లోబల్ అసోసియేషన్ ఫర్ ఎంఎస్‌ఎంఈఎస్ కో ఫౌండర్ ప్రొఫెసర్ హిమాచలం దాస రాజు అన్నారు. హనుమకొండ నయింనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ త్రో ఎంఎస్‌ఎంఈఎస్ అనే అంశంపై జాతీయ సెమినార్ బుధవారం జరిగింది. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ.. దేశ జీడీపీలో 30 శాతం, ఉద్యోగ కల్పనలో 40 శాతం, ఉత్పాదక రంగంలో 45 శాతం మేర సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా సంస్థ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేందర్, ప్రొఫెసర్ అమరవేణి, డాక్టర్ మహేందర్ కుమార్, వాగ్దేవి కళాశాల అకడమిక్ డైరెక్టర్ వాహినీదేవి, ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, కాన్ఫరెన్స్ కన్వీనర్లు పి.సుగుణాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కో కన్వీనర్ ఎ.రజిని కుమార్, కోఆర్డినేటర్లు బి.కిశోర్ కుమార్, టి.అనూష, సీహెచ్.కరుణ, బి.చంద్రకళనాయక్, శాంభవి, డాక్టర్ ఎం.అరవింద తదితరులున్నారు.

దేవాదుల మోటార్లు నడిపించకుండానే పలాయనం

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

హన్మకొండ: దేవన్నపేటలో మోటార్లు నడిపించిన తర్వాత వరంగల్ నుంచి వెళ్తామని చెప్పిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెల్లారేసరికి పలాయనం చిత్తగించారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం హసన్‌పర్తి మండలం దేవన్నపేట పంప్ హౌజ్ వద్ద మంత్రులు పూజలు చేసి మోటార్లు ఆన్ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదన్నారు. దీంతో మంత్రులు అధికారులపై మండిపడ్డారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించారన్నారు. దేవాదుల మెయింటెనెన్స్‌కు కాంట్రాక్టరకు ఏటా రూ.7 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో 20 శాతం కమీషన్ ఇవ్వనందునే సర్కారు పెద్దలు బిల్లులు విడుదల చేయలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్.. సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంతో సమ్మె చేశారని, దీంతో మెయింటెనెన్స్ చేయలేదని వివరించారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేసిన కడియం శ్రీహరి పార్టీలు మారడం, బిడ్డ ఎంపీ సీటు మీద దృష్టి సారించాడే తప్ప రైతుల ప్రయోజనాలు పట్టించుకోలేదన్నారు. త్వరలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు దేవాదుల పంపు హౌజ్ పర్యటన చేపడుతామన్నారు. సమావేశంలో టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, జోరిక రమేశ్, సల్వాజీ రవీందర్ రావు, నయిమొద్దీన్, బండి రజినీకుమార్, చాగంటి రమేశ్, పోలపల్లి రామ్మూర్తి, ఖలీల్, శ్రీకాంత్‌చారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

- వాహనాలకు సైడ్ మిర్రర్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు
- ఈ ఘటనల్లో ద్విచక్రవాహనాలే ఎక్కువ
- నిర్లక్ష్యం.. అతివేగమే ప్రధాన కారణాలు
- నగరంలో పెరుగుతున్న యాక్సిడెంట్లు
- బైక్ అద్దాలపై అవగాహన పెంచాలంటున్న ప్రజలు..

అద్దం లేక అపాయం!

ఖిలా వరంగల్ : ఏ వాహనానికైనా సైడ్ మిర్రర్ తప్పనిసరి.. వెనుక నుంచి వస్తున్న వాహనాలు కనిపించాలంటే అద్దం కచ్చితంగా ఉండాలి. అప్పుడే రోడ్డు ప్రమదాలు జరగవు. అయితే చాలా మంది అద్దం లేకుంటే ఏమవుతుందిలే అనుకుంటున్నారు. చిన్న పొరపాటే ప్రాణాల మీదికి తెస్తోంది. కేవలం అద్దం లేకపోవడంతోనే ఇటీవల పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. బైక్ అందం పాడు చేస్తుందని కొంత మంది అద్దాలు తీసేస్తున్నారు. ఫలితంగా వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల సంభవిస్తున్నాయి. వీరిలో 80 శాతం మందికి సైడ్ మిర్రర్ లేకపోవడంతో అపరాధ రుసుం వేసినా మారడం లేదు. తమ వాహనాలకు అద్దం ఏర్పాటు చేసుకోవడం లేదు.

రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు..

వరంగల్ జిల్లాతోపాటు నగరంలో రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నిండు ప్రాణాలు గాల్లో కలుస్తూనే ఉన్నాయి. దీనికి ప్రధానం కారణం సైడ్ మిర్రర్ లేకపోవడమేనని తెలుస్తోంది. యువత బైక్‌కు అద్దాలు తీసి వాహనంపై అతివేగంగా ర్యాష్ డ్రైవింగ్, మద్యం మత్తు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణాలతో ప్రాణాలు కోల్పోతున్నారు.

తొందరపాటు ఎందుకు?

యువతలో హడావిడిగా బయల్దేరే వారే ఎక్కువ ఉంటున్నారు. సమయం మించి పోతుందనే ధోరణిలో వేగంగా వెళ్తుంటారు. అందుకే ప్రయాణంపై ముందస్తు ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి.

సిగ్నల్స్ చూసుకోండి..



రహదారులపై వాహనాల సంఖ్య భారీగా పెరిగాయి. దీంతో కూడళ్ల వద్ద వాటిని నియంత్రించేందుకు సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే వారికి ఈ విషయంపై సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

హెల్మెట్‌తో లాభం..

ప్రమాదాల సమయంలో హెల్మెట్ వాహనదారులకు రక్షణ కవచంగా నిలుస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి బైక్ నుంచి కిందపడిన సందర్భంలో తలకు గాయాలవ్వకుండా హెల్మెట్ నిలువరిస్తుంది. ద్విచక్రవాహనంపై ప్రయాణం చేస్తున్న సమయంలో దుమ్ము, ఎండ నుంచి హెల్మెట్ రక్షణగా ఉంటుంది. వేగం కన్నా ప్రాణం ముఖ్యమనే అంశం ప్రతీ వాహనదారుడు గుర్తుంచుకోవాలి.

ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు

బాలురు, యువకులు డ్రైవింగ్ మీద అవగాహన లేక మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. యువత ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో స్పీడ్ కంట్రోల్ చేసి నడిపితే క్షేమం. 18 నుంచి 20 సంవత్సరాల్లోపు యువకులు ఎక్కువగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

యువత మద్యం తాగి మాకేం కాదులే అని వాహనాలు నడుపుతోంది. భారీ వాహనాలను వెనుక నుంచి అనుసరించడం, ఎదుటి వాహనాలను పట్టించుకోకుండా ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. విన్యాసాలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



బైక్‌కు అద్దాలు లేకుండా వెళ్తున్న వాహనదారుడు

నిర్లక్ష్యం వద్దు..

రోడ్డుపై అప్పటి వరకు వరకు నెమ్మదిగా వెళ్తున్న వారు కూడా వెనుక నుంచి క్రాస్ చేసిన వారిని ఓవర్‌టేక్ చేయాలని దూసుకెళ్తారు. ఇందుకోసం వాహన వేగం పెంచుతున్నారు. ఇలాంటివి వద్దు.

శిక్షణ లేకుండా వద్దు..

అత్యధిక శాతం మంది సరైన శిక్షణ లేకుండానే బైక్ నడుపుతున్నారు. ఇంటి వద్దకు వచ్చిన బైక్‌ను సరదాగా బయటకు తీయడం వంటివి చేసి తమకు బైక్ నడపడం వచ్చిందనే భ్రమలో రోడ్డు ఎక్కుతున్నారు. ఈవిషయంలో తల్లిదండ్రులే అప్రమత్తంగా ఉండాలి.

వాహనాలకు సైడ్ మిర్రర్లు తప్పనిసరి



వాహనాలకు సైడ్ మిర్రర్ ఉంటే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయి. నగరంలో చాలా ఘటనల్లో వెనుక వచ్చే వాహనాలు చూసుకోక పక్కకు తిప్పడం వల్లే ప్రమాదాలు జరిగాయి. ద్విచక్రవాహనాలతో పాటు ఆటోలు, కార్లు సైడ్ మిర్రర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు. అంతేకాకుండా హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చు.

– శోభన్‌బాబు ఇన్‌చార్జ్ ఆర్టీఓ వరంగల్